క్లుప్తంగా

సొంత స్థానాలకు పంపించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గిరిజన బీఎడ్ కళాశాలలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయులను వారి సొంత స్థానాలకు తక్షణమే పంపించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో కాకా సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో ఆరు నుంచి ఎనిమిదో తరగతులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి పాఠాలు బోధించమని ఉపాధ్యాయులకు చెప్పడం విద్యార్థుల సామర్థ్యాలను దెబ్బ తీయడమేనని అన్నారు. కుర్సం రవి, శ్రీను ఇతర నాయకులు పాల్గొన్నారు.

'బుడగం' జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న బుడగం శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శాసన సభ్యుడు పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు సమక్షంలో టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ జన్మదిన వేడుకలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తా'

భద్రాచలంఅర్బన్: తనకు టికెట్ ఇస్తే భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని ప్రభుత్వ అధికారి కొర్స వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో సోయం కామరాజు అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తాను ఎన్నో సేవా కార్యక్రమాలు సైతం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, సోయం కామరాజు, ఏఏఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూప నాగేశ్వరరావు, తెల్లం నరసింహారావు, నూప సీతయ్య, సొండె మల్లూరు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని కటాయిగూడెం గ్రామం గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థిని కొర్సా లక్ష్మీకి పలువురు చేయూతనందించారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ ఇంజనీర్ కొర్స వెంకటేశ్వరరావు విద్యార్థిని తల్లిదండ్రులకు రూ.33వేలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కొర్స వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అనేకమంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఆదివాసీ నాయకులు కల్లూరి జయ బాబు, పూనెం శ్రీనివాస్, సోయం కామరాజు, కారం గాంధీ నూప నాగేశ్వరరావు, తెల్లం నరసింహారావు, నూప సీతయ్య, వాసం ఆదినారాయణ, వట్టం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతి

గుండాల: పది రోజుల క్రితం రోడ్డు ప్రమదంలో గాయపడిన గ్రామ పంచాయతీ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఈసం గోపయ్య(50) గత కొన్ని సంవత్సరాలుగా గుండాల గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా ఇటీవల పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నం కాగా ద్విచక్ర వాహనం అతన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపయ్యను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. గత పది రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి సర్పంచ్ కొమరం సీతారాములు, ప్రజాపంథా నాయకులు కొమరం శాంతయ్యలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రభుత్వం అతని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామానికి చెందిన యక్కటి సత్యనారాయణరెడ్డి ఇటీవల మృతి చెందగా ఆదివారం జరిగిన దశదిన కర్మకు పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తినేని వాసు, ఓరుగంటి రమేష్, గాదె కేశవరెడ్డి, కొండలరావు, బొబ్బాల నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి, పున్నారెడ్డి, నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వణికిస్తున్న విష జ్వరాలు

- పెరుగుతున్న డెంగీ కేసులు
- ఐసీయూల్లో చేరుతున్న బాధితులు
- మరణాలూ నమోదు


బూర్గంపాడు సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

బూర్గంపాడు: విషజ్వరాలు జనాలను వణికిస్తున్నాయి. పినపాక నియోజకవర్గంలో రోజురోజుకూ జ్వరాల తీవ్రత పెరుగుతోంది. చాలామంది డెంగీ లక్షణాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. మరికొందరు మలేరియాతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. డెంగీతో ప్లేట్‌లెట్ కౌంట్స్ పడిపోవటంతో బాధితులు కార్పొరేట్ ఆస్పత్రుల బాటపట్టి అత్యవసర చికిత్సల నిమిత్తం ఐసీయూలలో చేరుతున్నారు. లక్షలాది రూపాయలు వైద్యం కోసం ఖర్చుచేయాల్సి వస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లినప్పటికీ కొందరికి ప్రయోజనం లేకుండా పోతుంది. అశ్వాపురం మండలంలో గతవారం ముగ్గురు వ్యక్తులు డెంగీతో,బూర్గంపాడు మండలంలో ఇద్దరు వ్యక్తులు జ్వరంతో మృతిచెందారు.

బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో సుమారు 200మందికి పైగా జ్వరపీడితులున్నారు. వీరు గత పదిరోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. గ్రామంలోని పాఠశాలలు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక వైద్యశిబిరాన్ని కొనసాగిస్తోంది. డెంగీ జ్వరాలతో గ్రామస్థాయి నుంచి కార్పొరేట్ స్థాయి వరకు ఆస్పతులు కిటకిటలాడుతున్నాయి. జ్వరాలతో ఆస్పత్రులలో చేరిన వారికి వైద్యపరీక్షలు చేసి వైద్యం అందిస్తున్నారు. ప్రతి ఇరవైమంది జ్వరపీడితులలో ఒకరిద్దరిలో డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయి.

ప్రభావం చూపుతున్న వరదలు

గోదావరి వరదలు తగ్గిన తరువాత భద్రాచలం డివిజన్‌లో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. జూలై నెలలో భారీ వర్షాలు, వరదలతో గ్రామాల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దోమకాటుతో జ్వరాలు విపరీతంగా పెరిగాయి. వైద్యారోగ్యశాఖ అప్రమత్తమై వైద్యసేవలను విస్తృతపరుస్తున్నప్పటికీ జ్వరాలు మాత్రం తగ్గటం లేదు.

బాధితులపై ఆర్థిక భారం

డెంగీ జ్వరాలతో బాధపడుతున్నవారికి ఆస్పత్రుల లో రోజుకు రూ.20వేల వరకు ఖర్చవుతున్నాయి. రోజుల తరబడి ఆస్పత్రులలో ఉండటంతో లక్షల రూపాయలు ఖర్చవుతున్నట్లు జ్వరపీడితులు వాపోతున్నారు. రోజు రక్తపరీక్షలు, మందులకు డబ్బు బాగా ఖర్చవుతున్నాయని బాధితులంటున్నారు. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిన వారికి ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు కూడా బాగానే ఖర్చుచేయాల్సి వస్తోంది. సాధారణంగా ప్రతి ఒక్కరిలో 1.50 లక్షల నుంచి 4.50లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. డెంగీ బాధితుల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ 40వేలకు పడిపోతోంది. ప్లేట్‌లెట్స్ కౌంట్ 20వేలకు పడిపోతే ప్రమాదకర పరిస్థితులుంటాయని వైద్యులు చెబుతున్నారు. 20వేలకు ప్లేట్‌లెట్ కౌంట్ పడిపోగానే ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తున్నారు.

వైద్యారోగ్యశాఖపై పెరిగిన బాధ్యత

జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది నియంత్రణ చర్యలను మరింత పెంచాల్సి ఉంది. గ్రామాల్లోని నీటిగుంతలలో యాంటీ లార్వా చర్యలు, ఫాగింగ్, దోమల నివారణ మందులు పిచికారీ చర్యలు పెంచాలి. వైద్యారోగ్యశాఖ ఇంటింటి ఫీవర్ సర్వే చేసి, రక్త నమూనాలు సేకరించి జ్వర లక్షణాలు గుర్తించాల్సి ఉంది. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం జ్వరాల తీవ్రత పెరుగుతోంది. బూర్గంపాడు సివిల్ ఆస్పత్రికి ఎక్కువగా మలేరియా కేసులు వస్తున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా దోమకాటు పెరిగింది. దోమకాటుకు గురికాకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి. పాత డబ్బాలలో, తాగిపడేసిన కొబ్బరిబొండాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. జ్వరం వచ్చిన వెంటనే ఎలాంటి నిర్లక్ష్యంగా వహించకుండా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ నవీన్,
సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, బూర్గంపాడు

అంధకారంలో ప్రధాన రహదారి


రాత్రివేళ చీకట్లో లక్ష్మీనగరం గ్రామం

దుమ్ముగూడెం: మండల ప్రధాన గ్రామంగా ఉన్న లక్ష్మీనగరం గ్రామంలో గత నాలుగు రోజులుగా రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పంచాయతీ సిబ్బంది వీధి లైట్లు వేయకపోవడంతో చిమ్మ చీకటిగా ఉంటోంది. సూపర్ మార్కెట్ నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు అలాగే రెడ్డి, కమ్మ, కుమ్మరి బజార్‌లో వీధుల్లో ఈ పరిస్థితి సుస్పష్టంగా కనిపిస్తోంది. దీనివల్ల రహదారిపై ప్రయాణించే వాహనాల లైటింగ్, దుకాణాల ఎదుట ఉన్న లైటింగ్ మాత్రమే కనిపిస్తోంది. దుకాణాలు మూసిన అనంతరం గ్రామం ప్రధాన రహదారి మొత్తం కారుచీకటి కమ్ముతోంది. ఈ నేపథ్యంలో ఏదైనా అవసరం పడితే చేతిలో లైట్ లేనిది ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. మరోవైపు రాత్రి వేళల్లో గ్రామంలో వాహనాలలోని డీజిల్, పెట్రోల్‌లను గుర్తు తెలియని దుండగులు దొంగిలిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. అధికారులు ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంస్థ సేవలు అభినందనీయం

భద్రాచలంఅర్బన్: గత పది సంవత్సరాలుగా నేను సైతం స్వచ్ఛంద సంస్థ భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపహాడ్ మండలాల్లో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ వృద్ధులకు, దివ్యాంగులకు ఆసరాగా నిలవడం అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. ఆదివారం నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేను సైతం స్వచ్ఛంద సంస్థ తరపున మరింతగా సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్, డాక్టర్ సరోజిని, డాక్టర్ ఉదయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, అడబాల వెంకటేశ్వరరావు, నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు సావిత్రి, ఈటి రాజేశ్వరరావు, ఎస్‌కె.అజీమ్, శ్రీనివాసరెడ్డి, పెదరాజు, తిరుమలరావు, రాజా శ్రీనివాసరావు, శరత్ బాబు, విజయలక్ష్మి, భవిత పాల్గొన్నారు.

పాఠశాలకు గేటు ఏర్పాటు

అశ్వాపురం: అశ్వాపురం జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమని అశ్వాపురం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఇటీవల నిర్వహించగా పాఠశాల ప్రధాన ద్వారానికి గేటు లేదని హెచ్‌ఎం వారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పూర్వ విద్యార్థులు రూ.60 వేలతో ఇనుప గేటును వితరణగా అందజేశారు. ఆదివారం హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాల ద్వారానికి గేటును అమర్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ముందుకు రావడం వల్ల పాఠశాల అభివృద్ధి స్వచ్ఛందంగా జరుగుతుందన్నారు.

సందడిగా బోనాల పండుగ


అశ్వారావుపేటరూరల్: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట ఎస్టీ కాలనీలో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. స్థానిక రామాలయం నుంచి మహిళలు, గ్రామస్తులంతా కలిసి బోనాలను తలపై ఎత్తుకుని మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న ముత్యాలమ్మ తల్లి ఆలయానికి బోనాలను తీసుకెళ్లి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి సమర్పించారు. అదే విధంగా తిరుమలకుంటలో ఉన్న బొడ్రాయికి, సమ్మక్క సారక్క ఆలయలంలో ప్రత్యేక పూజలు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ బోనాల ఉత్సవాలతో గ్రామంలో సందడి నెలకొంది.

ఎస్సీ కాలనీలో..

అశ్వాపురం: శ్రావణమాసం సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో తొలుత సాయినాథుడి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకొని పురవీధుల్లో భారీ ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. పాడి పంటలతో పిల్లా పాపలతో కుటుంబాలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో చుంచు రామ్మూర్తి, ఇసంపల్లి కృష్ణ, గద్దల ఏడుకొండలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద నేడు వేలం పాట

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన చీరలను పోగు చేసుకునేందుకు లైసెన్స్ హక్కు కోసం సోమవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 31 మార్చి, 2024 వరకు లైసెన్స్ కాలపరిమితి ఉంటుందని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని ఈఓ వెల్లడించారు. వేలంలో పాల్గొను వారు ముందుగా రూ.25వేలు ప్రథమ ధరావత్తు చెల్లించాలని ఆలయ బాధ్యులు సూచించారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌కు సన్మానం

భద్రాచలంఅర్బన్: ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన లకావత్ వెంకటేశ్వర్లును భద్రాచలం డివిజన్ బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వాంకుడోతు కృష్ణ నాయక్, వీరన్న, కోశాధికారి బన్సీలాల్, ఉపాధ్యక్షుడు సితియా నాయక్, లక్ష్మణ్ నాయక్, గోవింద నాయక్, తారాచంద్, పవన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓకు..

దుమ్ముగూడెం: మండల పంచాయతీ అధికారి ముత్యాలరావును మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించింది. ఉత్తమ ఎంపీఓగా అవార్డు అందుకోడాన్ని పురస్కరించుకుని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, శ్రావణి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న రెండో ఏఎన్‌ఎంలు

భద్రాచలంఅర్బన్: గత 15 సంవత్సరాల నుంచి ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బల్లా సాయికుమార్ అన్నారు. సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు సాయి, అన్నపురెడ్డి, విక్రం, అనిల్, రెండో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బూర్గంపాడు: కృష్ణసాగర్ అటవీప్రాంతంలో హరితహారం మొక్కలను వృథాగా పడేశారని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కృష్ణసాగర్ అటవీప్రాంతంలో వృథాగా పడేసిన ట్రాక్టర్ హరితహారం మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోట్ల రూపాయల ప్రజాధనంతో పెంచిన మొక్కలను నాటకుండా వృథాగా అటవీప్రాంతంలో పడేసిన వారిపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం


పినపాక: పాత రెడ్డిపాలెం- చింతల బయ్యారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రేగా

పినపాక: కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలో పర్యటించి సుమారు 9 కోట్లు విలువైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాతరెడ్డిపాలెం నుంచి చింతల బయ్యారం, జానంపేట నుండి అమరారం, మల్లారం నుంచి వెంకటేశ్వరపురం, గొట్టిల నుండి చినరాజుపేట వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ రవిశేఖర్ వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామి

కరకగూడెం: సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం.. దేశంలోనే అగ్రగామిగా ఉందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని చొప్పాల గ్రామపంచాయతీ పరిధిలోని గొడుగుబండ గ్రామంలో సుమారు రూ. 18.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వట్టివాగు ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. అలాగే కరకగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 13 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్‌ఎండ్‌బీ తాటిగూడెం నుంచి గాంధీనగర్ వరకు రూ.కోటి వ్యయంతో, వెంకటాపురం పంచాయతీ పరిధిలో రూ.3 కోట్ల వ్యయంతో, పూలకొమ్మతోగు నుంచి దోమెడ వరకు రూ.కోటి వ్యయంతో, కరకగూడెం నుంచి మొట్లగూడెం వరకు రూ. 2.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. కన్నాయిగూడెంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటే లక్ష్యం


పశువైద్యశాల ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తూ.. మట్టి రోడ్డు లేని గ్రామాలే లక్ష్యంగా పని చేస్తానని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని 17 గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటన మండంలోని పలు గ్రామాల్లో ఇప్పటివరకు ఎరగని రీతిలో భారీ కాన్వాయ్, అనుచరగణంతో కొనసాగింది. మండల పరిధిలోని గణేస్‌పాడు, రాళ్లబంజర, నాచారం, శ్రీరాంపురం, నాగుపల్లి, మొండివర్రె, బాలరాజుగూడెం, జగ్గారం, పట్వారిగూడెం, పార్కలగండి, చిల్లగుంపు తదితర గ్రామాల్లో నిర్మాణం పూర్తి అయిన 25 సీసీ రోడ్లను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. నాచారం గ్రామంలో పశువైద్యశాల ఉపకేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి


కుంగిన రోడ్డుకు ఇరువైపులా ప్రమాద సూచికలు ఏర్పాటు చేసిన స్థానికులు

చర్ల: మండలంలోని కలివేరులో గల ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి రెండు వైపులా కుంగడంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భద్రాచలం–చర్ల రాష్ట్రీయ రహదారిపై ప్రైవేటు సెల్ నెట్‌వర్క్‌లకు సంబంధించిన కంపెనీలో రహదారిని ఇష్టమొచ్చినట్లు తవ్వి.. తిరిగి సరైన రీతిలో పూడ్చలేదు. తాజాగా కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి కృంగి రహదార్లు ప్రమాదభరితంగా మారాయి. అదే క్రమంలో మండలంలోని కలివేరు సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలోని సెల్ టవర్‌కు అండర్ గ్రౌండ్ ఫైబర్‌ను ఏర్పాటు చేసే క్రమంలో సంబంధిత సెల్ టవర్ కంపెనీ మార్చి నెలలో రోడ్డు కింద నుంచి తవ్వేసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆ ప్రాంతంలో డబుల్ రోడ్డుకు ఇరువైపులా మూడేసి అడుగుల చొప్పున కృంగడంతో ఆ ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు కృంగిన విషయం తెలిసినప్పటికీ సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై ప్రజలు, వాహనదారులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రోడ్డు కృంగి రోడ్డుకు ఇరువైపులా ప్రమాదబరితంగా ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు ఇరువైపులా కర్రలు పాతి వాటికి ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అధ్వానంగా దారి


పశువైద్యశాలకు వెళ్లే దారిలో బురద, పిచ్చి మొక్కలు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో ఉన్న పశు వైద్యశాల ప్రాంగణం పిచ్చి మొక్కలతో వర్షపు నీటితో నిండి అధ్వానంగా దర్శనమిస్తోంది. హాస్పిటల్‌కి వెళ్లే దారి మొత్తం మొక్కలు మొలచి మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిలిచాయి. దీంతో వైద్యశాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ బురద నీటిలో ఆ పిచ్చి మొక్కల మధ్య నుంచి తమ పశువులను తీసుకువస్తున్నారు. వైద్యశాల సిబ్బంది వాటిని తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. కనీసం ములకపాడు పంచాయతీ సిబ్బంది కూడా ములకపాడు రహదారి పక్కన నిలిచిన వర్షపు నీటిని తొలగించకపోవడం విస్మయం కలుగజేస్తోంది.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ కుటుంబాలు కాంగ్రెస్, టీడీపీ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరాయి. స్థానిక బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు సమక్షంలో గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వారు పార్టీలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మారుతి లలిత, పార్టీ నాయకులు ఉప్పల మురళి, లోకం సాంబశివరావు, ఉప్పల ప్రసాద్, చందా లక్ష్మీనారాయణ, వీర్నాల హరి ప్రసాద్, బేతి రాజశేఖర్, సింగలదేవి దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి


భద్రాచలంఅర్బన్: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

దేశ దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆధునిక భారతానికి పునాదులు వేసి అణగారిన బతుకుల్లో వెలుగులు నింపిన మహానేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఐటీ రంగాన్ని పరిచయం చేసి నడిపించారని అన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


అన్నపురెడ్డిపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


అశ్వాపురం: మొండికుంటలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నివాళులు..